# "ఒక అమ్మాయి - ఒక నది"

కరేబియన్ (ఆంగ్ల) మూలం: మైకేల్ ఆంథోని


స్వేచ్ఛానువాదం: చీమలమర్రి శ్రీనివాసమూర్తి

**ఆర్టాయిర్ గ్రామంలో ఆ పడవను తెలియనివారుండరు. అర్థం చేసుకోలేని పసివాళ్ళు మతిస్థిమితం కోల్పోయిన వయోవృద్ధులు తప్ప. ఎందుకంటే ఆ గ్రామం ఏర్పడకముందు నుంచే ఆ పడవ అక్కడ వుంది. ప్రక్కన ప్రవహించే నది మీద వంతెన కట్టటం అసంభవం అని ప్రజలు అనుకున్న దశ నుండి (అంటే వంతెన కట్టటానికి వీలులేనంత వెడల్పుగా ఆ నది వుందని ప్రజలు నమ్మిన కాలం నుండి) ఆ పడవ నడుస్తూ ఉంది.**

కానీ యిప్పుడా పడవ లేదు. మనుషులను, వెహికిల్స్‌ను నదికి అవతలివైపు చేర్చటానికి అనువైన ప్లాట్‌ఫాం కూడా లేదు. నదిలో నుండి పడవ ప్రయాణించే దిశను నిర్దేశించే బొంగులుగానీ, తీగెలుగానీ లేవు. నీవు యిప్పుడా నదిమీద ప్రయాణిస్తుంటే కొత్తగా వచ్చిన వంతెనను చూసి నివ్వెరపోతావు. దాన్ని చూసి నేను ఉద్యోగంలో చేరిన తర్వాత మొట్టమొదటిసారి ఆ వంతెనను నిర్మించి ఎంత ఆనందం పొందానో అంతే ఆనందాన్ని నీవు కూడా పొందుతావు. ఆ సమయంలో పని మొదలుపెట్టగానే నేను అపరిమితానందానికి గురైనాను. ఉత్సాహంతో పొంగిపోయాను. కాని ఆ గ్రామం యావత్తూ నామీద ఆగ్రహంతో ఉడికిపోయింది. పడవ నడిపేవాడి కారణంగా ప్రతి ఒక్కరూ నాపైన ఏహ్యాభావం పెంపొందించుకున్నారు. అతన్ని నదికి దూరంగా తరిమి వేయటానికి వచ్చిన సైతానుగా భావించారు. నేను పుట్టకముందు నుంచే పడవ నడపటమే తన పనిగా పెట్టుకుని అతను బ్రతుకుతున్నాడని తెలిసింది. కానీ యిప్పుడు, ఎక్కడినుండో అకస్మాత్తుగా ఊడిపడి వాడి నోట్లో మట్టి కొడుతున్నానని నానా మాటలు అన్నారు. కొందరు ఎలా కడతావో చూస్తామని బెదిరించారు. నేను మౌనంగా ఉండిపోయాను. కాని పనిమాత్రం ఆపలేదు. యిటువంటి పెద్ద సైజు వంతెన పని నాకు అవసరం. నా ప్రతిభను నిరూపించుకోటానికి దొరికిన అరుదైన అవకాశం. పైగా ఆర్టాయిర్ నది మీద వంతెన కూడా అవసరమే. గ్రామస్తులు బెదిరిస్తే, బెదిరిపోయే మనస్తత్వం నాది కాదు. తీరాలలో పునాదులు వేసే పని మొదలుపెట్టాను. చెట్లు నరికి నదీతీరాన్ని సిమెంటుతో దిమ్మెస కొట్టాము.

మేము మా పని చేస్తుంటే గ్రామస్తులు మా అందరి మీద తిట్ల వర్షం కురిపించారు. చివరకు బలవంతంగా పనిని ఆపుచేస్తామని, చంపుతామని బెదిరించారు. మాకు భయమేసింది. కాని అదృష్టవశాత్తు మాటలే తప్ప చేతలకు దిగే మనుషులు కాదు గనక మా పని మేము నిరాటంకంగా చేసుకుంటూ పోయాం. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా నిర్మాణం పూర్తిచేసి వెళ్ళిపోవాలనే ఉద్దేశంతో ఉదయం నుండి సాయంత్రం దాకా అవిశ్రాంతంగా పనులు చేస్తున్నాం. చీకటి పడగానే బిక్కుబిక్కుమంటూ మా క్వార్టర్స్‌లో దూరి తలుపులేసుకుండే వాళ్ళం. నది తప్ప మాకు మరో స్నేహితులు లేరు, ఒడ్డున పెరిగిన చెట్ల క్రింద బొరియల్లోని పీతలు, వచ్చిపోయే పక్షులు చుట్టూ వున్న ప్రకృతి తప్ప.

కొన్ని నెలల తర్వాత, వంతెన రూపురేఖలను దిద్దుకుంటున్న



ఆమె ధరించిన దుస్తులు ఖరీదైనవి కావు. బహుశా నేను అక్కడి నుండి వెళ్ళిపోతే బాగుండుననుకుంటున్నదేమో! కానీ నేను యింతవరకు ఆ గ్రామస్తులలో ఎవరితోనూ యింత దగ్గరగా మాట్లాడలేదు. ఈమే మొదటిది. నెమ్మదస్తురాలిలా వుంది. అందుకనే మాట్లాడాలని అనిపించింది.



సమయంలో, నా కల సాకారం కాబోతున్న తరుణంలో, రాత్రిపూట నిద్ర కరువైంది. త్వరగా పూర్తిచేసి పలాయన మంత్రం పఠించాలనే తపన ఎక్కువైంది. పరుపు మీద పడుకుని, రెప్పలు వాల్చిన మరుక్షణం, నా కళ్ళముందు జనాలు పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లు, ప్రారంభోత్సవానికి వెహికల్స్ బారులు తీరి వంతెన మీదుగా నడుస్తున్నట్లు దృశ్యాలు కన్పించేవి. ఉద్యోగంలో చేరిన తర్వాత నాకు ప్రభుత్వం యిచ్చిన మొట్టమొదటి అవకాశం ఈ వంతెన. నా ప్రతిభనంతా ఉపయోగించి దాన్ని అందంగా బలంగా నిర్మించి చూసిన ప్రజలు ఆ ప్రాంతాల్లో వున్న అన్ని వంతెనలకంటే అత్యుత్తమమయినదని పొగడుతుంటే వినాలని వుంది. కాని ఒకరకంగా అది పూర్తవుతుంటే నాలో నిస్సత్తువ ఆవహిస్తోంది. దాని నుండి తప్పించుకోటానికి, వంతెనను వొదిలి కొంతసేపు ఒంటరిగా తిరిగి రావాలనిపించేది. గ్రామంలో ఒంటరిగా తిరగలేను. నా ముఖం చూపించలేను. అందుకని నేనే బోటును నడుపుకుంటూ నదీవాలుగా కొంతదూరం పోయి బండల మీద కూర్చునేవాణ్ణి. చుట్టూ ఆవరించిన పచ్చదనం, కొండలు, స్వచ్ఛమైన ప్రవాహం చూస్తూ కూర్చునేవాణ్ణి.

నదిలో కొంత దూరం పోగానే, అందులో కలిసే చిన్న ఉపనది కన్పిస్తుంది. అక్కడ నీళ్ళు తేటగా స్వచ్ఛంగా కనిపిస్తాయి. అక్కడొక పెద్ద బండ వుంది. గ్రామ ప్రజలా బండ మీద బట్టలు ఉతుక్కోటానికి వస్తారు. ఎవరూ రాకముందు, నేను తరచుగా ఆ బండ మీద కూర్చుని ప్రశాంతంగా కొంతసేపు గడిపి వచ్చేవాణ్ణి. నేనున్న ప్రస్తుత పరిస్థితిని, తిరిగి మరో పని కోసం ఎక్కడకు వేస్తారో అనీ ఆలోచించుకునేవాణ్ణి. తరచుగా నా ఆలోచనలు ఆ వూరినీ, ఊరి ప్రజలనీ, చుట్టూ ఘనీభవించిన ప్రకృతి సౌందర్యాన్ని వూహించటంలో లీనమయేవి. గంట, గంటన్నర కాలం ప్రశాంతంగా గడిపి, తిరిగి బోటును నడిపించుకుంటూ నా క్వార్టర్‌కు చేరేవాణ్ణి.

అలాగే ఓరోజు, ముందుగానే ఆ బండవున్న ప్రాంతానికి చేరాను. అక్కడ అప్పటికే బట్టలు ఉతుకుతున్న ఒక అమ్మాయిని చూశాను. నేను కొద్దిగా నిరాశ చెందాను. వెనక్కు మళ్ళి వెళ్ళిపోదామని అనుకుంటున్న సమయంలో ఆమె నన్ను చూసింది. మర్యాదకోసం 'గుడ్ ఆఫ్టర్ నూన్' అని విష్ చేశాను.

"గుడ్ ఆఫ్టర్ నూన్ మిస్టర్ డంక్లెర్!" అనింది.

యిదివరకెన్నడూ ఆమె మొఖాన్ని చూసినట్లు లేదు. కాని ఆమెకు నా పేరు తెలుసు. బహుశా ఆ గ్రామంలో అందరికీ నా పేరు తెలిసినట్లుంది.

"చాలా శ్రమపడుతున్నారు"- ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి అన్నాను.

"అవును" అందా అమ్మాయి.

ఆమె ధరించిన దుస్తులు ఖరీదైనవి కావు. బహుశా నేను అక్కడి నుండి వెళ్ళిపోతే బాగుండుననుకుంటున్నదేమో! కానీ నేను యింతవరకు ఆ గ్రామస్తులలో ఎవరితోనూ యింత దగ్గరగా మాట్లాడలేదు. ఈమే మొదటిది. నెమ్మదస్తురాలిలా వుంది. అందుకనే మాట్లాడాలని అనిపించింది. తను కూడా నేనీ గ్రామానికి పట్టిన భూతాన్ని అనుకుంటున్నదేమో తెలుసుకోవాలనిపించింది.

"యిక్కడ నీరు స్వచ్ఛంగా ఉంటుంది" అన్నాను.

"అందుకనే బట్టలు ఉతకటానికి యిక్కడికొస్తాం" అనింది.

ఆమె ఉతికి ప్రక్కనుంచిన కుప్ప మీదికి నా దృష్టి పోయింది. దానిప్రక్కనే యింకా వుతకాల్సిన మరో కుప్ప వుంది.

"ఈరోజు యివన్నీ ఉతకాలా?" అడిగాను.

"ఉతకక తప్పదు. లేకపోతే రేపు మళ్ళీ రావాలి"- ఆమె చేతుల నిండా సబ్బు నురగ. ఒకసారి ఎదురుగా ఉన్న బట్టల కుప్ప వైపు, తన కాళ్ళను చుట్టి పారుతున్న నీటివైపు మార్చిమార్చి చూసింది.

"బహుశా అలసొస్తున్నాయనుకుంటాను" అన్నాను.

"అవును, నాకు ఆలస్యమవుతోంది. తొందరగా పని పూర్తిచేసుకుని వెళ్ళిపోవాలి" ఆమె మాటల్లో నన్ను వెళ్ళిపొమ్మన్నట్లు ధ్వనించింది. నేనామె మాటలు పట్టించుకోదల్చలేదు. వంతెన గురించి ఆమె అభిప్రాయమేమిటో తెలుసుకోకుండా అక్కడినుండి కదలాలనిపించలేదు. ఆమె తన పనిలో తాను నిమగ్నమైంది. బట్టల గుట్టలోంచి మరో బట్ట అందుకుంది. నేను కుప్ప వైపు చూశాను. ఆమె నిజంగా ఆ బట్టలను వుతకటంలో

సతమతమవుతోంది. శ్రమ మరిచిపోయేలా నేనేదైనా మాట్లాడగలి గితే బాగుండు. ఆమె వైపు చూశాను. ఆమె నావైపు చూడటం లేదుగానీ, నేను గమనిస్తున్నాననే విషయం ఆమెకు తెలుసు.

"నీలాగే నేను ఈ గ్రామం వాడినయితే బాగుండు. యిక్కడ చాలా ప్రశాంతంగా హాయిగా వుంది. యిటువంటి ప్రశాంతతలో పనిచేయటమంటే నాకు చాలా యిష్టం" అన్నాను.

"ఆర్టాయిడ్ చాలా ప్రశాంతంగా వుంటుంది" అనింది.

"యిటువంటి వాతావరణమే నేను కోరుకునేది" - నేను.

"నేను అనుకోను" అని కొద్దిగా హేళనగా నవ్వింది. "అంటే ఈ ప్రాంతం గురించి" అంది మళ్ళా సర్ది చెబుతూ.

"కానీ యిక్కడ చాలా డల్‌గా వుంటుంది. గ్రామంలో ఎలా వుంటుంది?"

అక్కడ చేయాల్సిన పనులేవీ లేవు. కాని ఈ వూరు, ఈ ప్రాంతమంటేనే నాకు చాలా యిష్టం."

నేను బోట్‌ను బండకు సమీపంగా చేర్చి, తీరం మీద కాలు మోపుతుంటే "మిస్టర్ డంక్లెర్" అనింది ఆతృతగా. నేను వెంటనే కాలు యధాప్రకారం బోటులో వుంచి తిరిగి వెళ్ళిపోవాలని బోట్‌ను మరల్చాను. ఆమెకు నవ్వు ఆగలేదు.

"నిన్ను అనవసరంగా యిబ్బందుల్లోకి నెట్టటం నాకు యిష్టం లేదు. నేను స్వయంగా అనుభవించాను, చాలు" అన్నాను.

"అదికాదు. నిన్ను ఎవరైనా యిక్కడ చూస్తే నీకు మంచిది కాదు. ఏంచేస్తారో తెలుసా? ప్రత్యేకంగా..."

"నాకు తెలుసు. నా తల వారి గ్రామంలో వ్రేలాడదీయాలని వారి కోరిక. ఆ విషయం నాకు తెలియదనుకుంటున్నావా?"

ఆమె మరోమారు నవ్వింది. నవ్వి "నేను నిన్ను ద్వేషిస్తున్నానని అనుకోవద్దు. నీవు నీ ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తున్నావని నాకు తెలుసు" అనింది.

థాంక్యూ వెరీమచ్. కానీ యిక్కడి ప్రజలు ఆ విషయం గ్రహించటంలేదు. నేను కేవలం ఒక ప్రభుత్వోద్యోగిని. వంతెన కోసం నన్నిక్కడికి పంపారు. యిక్కడ ఎవరి జీవనోపాధిని దూరం చేయటం కోసం రాలేదు" అన్నాను.

"దాన్ని గురించి బెంగపడకు. అయినా పని పూర్తి కావచ్చింది గదా!" అంది తన పని తాను చేసుకుంటూ.

"అంతా దేవుడి దయ" నేను కొద్దిగా రిలీఫ్ పొందాను.

"ఎంత త్వరగా యిక్కడి నుండి వెళ్ళిపోవాలా అని ఆలోచిస్తున్నావని నాకు తెలుసు."

అవును. కానీ నాకా నమ్మకం లేదు. వింతగా వుంది. నామీద ఈ వూరు పరిసరాల ప్రభావం పెరుగుతోంది. యిటువంటి వాతావరణం నాకు చాలా యిష్టం. చెట్లు, నది, పచ్చిక బయళ్ళు, పచ్చని పొలాలు, కొండలు, పక్షులు- ఎందుకో ఈ వనవాసం నన్ను కట్టి పడేసేలా వుంది. కాని ఈ వూరి ప్రజలు నన్ను స్వేచ్ఛగా తిరగనీయరు. నన్ను ద్వేషిస్తున్నారు."

బట్టలు మెలిపెడుతూ ఆమె నవ్వింది. "నన్ను కూడా ఈ గ్రామం కట్టిపడేసేలా వుంది" అనింది.

"అయితే నీవు ఈ వూరి అమ్మాయివి కాదన్నమాట. మరి...?" నేను ఆశ్చర్యపోయాను.

దీనికి జవాబుగా "అవును", "కాదు" అని చెప్పాల్సి వస్తుంది. నేనిక్కడిదాన్నే. కానీ నా జీవితమంతా సాంగ్రేగ్రాండేలో గడిపాను. నాన్నకు పనిలేకపోవటంతో, ఆయన సహాయం కోసం యిక్కడికి రావాల్సి వచ్చింది.

"అక్కడే పని చేసుకుంటూ సహాయం చేయవచ్చుగదా?"

కొద్దిసేపు తటపటాయిస్తూ "నేను యిక్కడే వుందామనుకుంటు న్నాను. నాన్న చాలా డిప్రెషన్‌లో వున్నాడు" నదివైపు సాలోచనగా చూస్తూ అనింది.

"మరి యిప్పుడెక్కడ పనిచేస్తున్నావ్?" అడిగాను.

"యిక్కడే"

ఆమె వైపు విస్తుపోతూ లిప్తకాలం మౌనంగా చూశాను. నాకు షాకు తిన్నట్లయింది. ఈమె కుటుంబానికి పెద్ద కూతురై వుంటుం దనీ, వారంవారం తమ కుటుంబం దుస్తులు వుతికి తీసుకెళ్తుం దని అనుకున్నాను యింతవరకు. కానీ ఈ అమ్మాయి ఊరిలోని వారందరి బట్టలు ఉతికే పని చేస్తున్నదని యిప్పుడు అర్థమైంది. తన తండ్రిని సాకటం కోసం నేను ఏమీ మాట్లాడలేకపోయాను. ఏం మాట్లాడాలో తోచలేదు. నాలుగైదు నిముషాలు ఒకరకమైన విషాదంతో ఆమెనూ, ఆమె ఉతుకుతున్న బట్టలనూ చూస్తూ నిల్చుని, నా బోటును వారికి దూరంగా నడిపాను, వంతెనవైపు. తరువాత నా క్వార్టర్‌లో దూరి కిటికీలో నుండి ఎదురుగా ఎత్తుగా, సగర్వంగా నిల్చున్న కట్టడాన్ని చూస్తూ నిల్చున్నాను. నాకిప్పుడు మునుపటిలా దాన్ని చూస్తుంటే గర్వం కలగటంలేదు.

జీవితాలు యింత మిస్టరీగా, విషాదంగా ఎందుకు తయారౌ తాయో అర్థం కావటంలేదు. యిక్కడ ఒక యింజనీర్ కల సాకారమై అద్భుతమైన వంతెన నిర్మించబడుతోంది. అక్కడ యిదే నదిలో, ఒక నిస్సహాయురాలు, బ్రతుకు తెరువు కోసం తన తండ్రిని కొనసాగటం కోసం బట్టలు ఉతుకుతోంది. చిత్రంగదూ!

***

రాత్రిపూట నా ఫోర్‌మెన్‌కు ఆ అమ్మాయి కథ చెప్తే అతను మంత్రం వేసినవాడులా మవునంగా వుండిపోవటం గమనించాను.

"ఏమయింది?" అడిగాను.

"మీకు ఆ అమ్మాయి తెలుసా?" అతను అడిగాడు.

"తెలియదు. కాని అందులో తేడా ఏముంటుంది? ఒక యువతి

**ఆమె వైపు విస్తుపోతూ లిప్తకాలం మౌనంగా చూశాను. నాకు షాకు తిన్నట్లయింది. ఈమె కుటుంబానికి పెద్ద కూతురై వుంటుందనీ, వారంవారం తమ కుటుంబం దుస్తులు వుతికి తీసుకెళ్తుందని అనుకున్నాను యింతవరకు.**

జీవితం నరకప్రాయంగా వుంది, అనిపించింది ఆమె కథవింటే."

"అయితే పశ్చాత్తాపపడుతున్నారా?"

"పశ్చాత్తాపమా? దేనికి?" నీ మాటలు నాకు అర్థం కావడం లేదు" అన్నాను అయోమయంగా అతని వైపు చూస్తూ.

అతను నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ "ఈ నాటకం యింతటి తో కట్టి పెట్టటం మంచిది సాలో!" నీ చుట్టూ జరుగుతున్న దేమిటో తెలియనట్లు నటించొద్దు" అన్నాడు అసహనంగా.

"ఏమిటిది? నా వెనకాల ఏద్దైనా జరుగుతోందా? వ్యతిరేకతగా మరేదైనా...."

ఫోర్‌మెన్ పెద్దగా నవ్వాడు. తరువాత ఆపి "పోనీయండి. వదిలేయండి, ఆ విషయం. మనం యిక్కడ వంతెన కట్టడానికి వచ్చాం. ఆ పని దాదాపు పూర్తికావొచ్చింది. ఈ ప్రాంతానికి నది మీద వంతెన అవసరం. ఆ విషయం ఆ పడవ నడిపేవాడు కూడా మెల్లగా అర్థం చేసుకుంటాడు. యిప్పుడు వూరివాళ్ళు కోపంగా వున్నా, కాలం గడిచేకొద్దీ మెల్లమెల్లగా సర్దుకుపోతారు. యిక ఆ పిల్ల విషయానికొస్తే, ఈ వంతెన మూలాన ఆమె యిప్పుడీ పని చేస్తోంది. యిందులో బాధపడాల్సిందేమీలేదు. ఆ ముసలాయన ఎక్కువ కాలం శిలలా బ్రతకడు గదా ఆమె తిరిగి సాగ్రేగ్రాండే పోయి మరో వుద్యో గం వెతుక్కుంటుంది. ఆ ముసలాయన ఈ పడవలాగే పని ఎలాగూ ఎక్కువ కాలం చెయ్యలేదు. ఎనభై సంవత్సరాల ముసలివాడు, గాడిదలను పడవలో ఎక్కించుకుని నది అవతలికి దాటించటం- ఒక్కసారి అతని స్థానంలో మీ నాన్నను వూహించుకో.

•